క్లుప్తంగా

ఘనంగా నారమ్మ, బంగారమ్మ తల్లి పండుగలు



పురవీధుల్లో ఊరేగింపు

విజయనగరం: నగరంలోని కొత్తపేట ప్రాంతంలో నారమ్మ తల్లి, బంగారమ్మ తల్లి పండుగలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్ల ప్రతిమలను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఉత్సవ నిర్వాహకుడు దున్న రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లకు మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు సూరిబాబు, దున్న గిరిబాబు, శ్రీనివాసరావు, చెన్నారావు, అనిల్‌కుమార్, కన్ని రాజు, కోయిల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏం.. పిల్లలూ ఎలా ఉన్నారు..



చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కొత్తకొప్పెర్ల పరిధిలో గల మత్స్యవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం పరిశీలించారు. పౌష్టికాహారం, మెనూ అమలుపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు చిన్నారులతో మాట్లాడుతూ, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మిఠాయిలు ఇవ్వాలని కార్యకర్త ఉమకు ఎమ్మెల్యే రూ. 500 ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, సూపర్‌వైజర్ రాజేశ్వరి, గ్రామస్తులు పుప్పాల లక్ష్మీనారాయణ, పట్టెపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాను అరికట్టాలి

- విశాఖ రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు



అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు

విజయనగరం క్రైమ్: రైళ్లలో మత్తు పదార్థాల రవాణాను అరికట్టాలని విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటరావు ఆదేశించారు. విజయనగరం జీఆర్‌పీ స్టేషన్‌ను శనివారం సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేర నివారణకు ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వేసవిలో నేరాల నివారణకు ప్లాట్‌ఫామ్ బీట్‌లు, రైల్ బీట్‌లలోల సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. డ్రగ్స్, బంగారం అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని.. నిందితులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీఆర్‌పీ ఎస్సై రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కొండకరకాంలో హౌసింగ్ డే



లబ్ధిదారులతో అధికారులు

విజయనగరం రూరల్: మండలంలోని కొండకరకాంలో మండల అధికారులు శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ, ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరావు, పంచాయతీ విస్తరణాధికారి తిరుపతినాయుడు, హౌసింగ్ ఏఈ వర్మరాజు, మండలశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ప్రతిభావంతులై జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ జూనియర్ కళాశాల విద్యార్థులను శనివారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకుని చదవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బొర్లి రవికుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలనపై సంపూర్ణ విశ్వాసం..

- 1.10 కోట్ల కుటుంబాల మద్దతే నిదర్శనం
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

రాష్ట్రంలో 1.45 కోట్ల కుటుంబాలుంటే .. 1.10 కోట్ల కుటుంబాలు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్ల తమ సంతృప్తి వ్యక్తం చేస్తూ 82960 82960 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చారని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ఈనెల 7 నుంచి 29వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం పేరిట వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, గృహసారథులు, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పాలనపై ఆరా తీశారని చెప్పారు. జిల్లాకేంద్రంలోని తన స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ, నాలుగేళ్ల పరిపాలన పూర్తయిన తర్వాత ఇంత ధైర్యంగా గతంలో ఏ ప్రభుత్వమూ ప్రజల వద్దకు వెళ్లలేదని గుర్తుచేశారు. ఒక్క వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంతోనే ఇది సాధ్యమైందన్నారు. జగనన్న హయాంలో రాజకీయాలు, కులమతాలకతీతంగా అర్హులందరూ సంక్షేమ పథకాల లబ్ధి పొందారని చెప్పారు. మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్ల గోడలకు అతికించుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ప్రస్తుతం పైసా అవినీతి కూడా జరగలేదని స్పష్టం చేశారు.

అవినీతి కోరుకునే వారికే అసంతృప్తి..

ఈ ప్రభుత్వంలో ఎవరైనా అసంతృప్తిగా ఉన్నారంటే.. అది కేవలం అవినీతి, లంచగొండితనం కోరుకున్నవారేనని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజా సంక్షేమానికి ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. విజయనగరం నియోజకవర్గంలో 91,857 ఇళ్లకు గాను 92.59 శాతం కుటుంబాలను నేరుగా కలిశామన్నారు. ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ 76,950 కుటుంబాల నుంచి మిస్డ్‌కాల్స్ వచ్చాయని చెప్పారు.

అశోక్ సిగ్గుపడాలి..

కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు సెల్ఫీ చాలెంజ్‌లకు తాను స్పందించాల్సిన అవసరం లేదని కోలగట్ల అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇస్తున్న సెల్ఫీ చాలెంజ్‌లకు ఆయన సమాధానం ఇచ్చుకుంటే చాలన్నారు. కొన్ని రాష్ట్రాలను కలుపుకొంటూ నేషనల్ హైవేను కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తోందని, అది ఆయన ఘనతగా చెప్పుకోవడానికి అశోక్ సిగ్గుపడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పనిచేసిన ఆయన విజయనగరానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగింతో ఒకే వేదిక మీద చర్చకు రావాలని సవాల్ విసిరారారు. కార్యక్రమంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయ్..



పూసపాటిరేగ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ రావడంతో ప్రతిపక్ష పార్టీలు తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరవుతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొత్తకొప్పెర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 7వ తేదీ నుంచి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పేరుతో మెగా పీపుల్స్ సర్వే నిర్వహించిందన్నారు. మెగా సర్వేలో 1.45 కోట్ల కుటుంబాలు పాల్గొనగా.. 1.10 కోట్ల కుటుంబాలు మిస్డ్‌కాల్స్ ఇచ్చాయని చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాల మధ్య ఉన్న తేడాలను తెలియజేశామన్నారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై ప్రజలు చూపించిన నమ్మకం మరువలేదని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు భూసేకరణ జరగకుండానే మాజీ సీఎం చంద్రబాబునాయుడు అప్పట్లో శంకుస్థాపన చేయడం విడ్డూరమన్నారు. తాజాగా భూసేకరణ, ఆర్‌ఆర్ ప్యాకేజీ, నిర్వాసితులకు గృహాలు, కోర్టు అడ్డంకులు తొలగించి మే 3న ఎయిర్‌పోర్టుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఎయిర్‌పోర్టుకు 2300 ఎకరాలు కేటాయించడంతో పాటు 5 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. అలాగే రూ.125 కోట్లతో చేపట్టనున్న చింతపల్లి ఫ్లోటింగ్ జెట్టీకి సీఎం శంకుస్థాపన చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని గుర్తించకుండా టీడీపీ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు చాలెంజ్‌లు విసరడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, ఎస్. సత్యనారాయణరాజు, దాడిశెట్టి త్రినాథరావు, బొల్లు రమేష్, పిన్నింటి ఎల్లంనాయుడు, బొడ్డు ఎల్లాజీ, దారపు గున్నారెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, టి.సీతారాం, దేశెట్టి గణేష్, తాడిశెట్టి బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లల సంరక్షణ అందరి బాధ్యత

- కన్యా సురక్ష స్థూపం ఆవిష్కరించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



కన్యా సురక్ష స్థూపాన్ని ఆవిష్కరించిన అనంతరం శ్రీ జైన్ శ్వేతాంబర్ మహిళా మండలి సభ్యులతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ఆడపిల్లలను సంరక్షించుకోవడం మనందరి బాధ్యతగా గుర్తెరగాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సెంటర్‌లో ప్రతిష్టాత్మక కన్యా సురక్ష స్థూపాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ఆవిష్కరించారు. శ్రీ జైన్ శ్వేతాంబర్ మహిళా మండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కన్యా స్థూపం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీ జైన్ శ్వేతాంబర్ మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు రీటా అంచాలియా, కమలా హీరావత్ మాట్లాడుతూ, ప్రతిష్టాత్మకమైన కన్యా స్థూపాన్ని నగరంలో ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భ్రూణ హత్యలు, ఆడ పిల్లలపై లైంగిక వేధింపులు పూర్తిగా తగ్గిపోవాలన్నారు. ఆడపిల్లలకు ధైర్యాన్ని ఇచ్చేవిధంగా కన్యా సురక్ష స్థూపాలను దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, స్థానిక కార్పొరేటర్ పిల్లా రాధాభవాని, జోనల్ ఇన్‌చార్జ్ ముచ్చు శ్రీనివాసరావు, సంఘ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అంచాలయ, ఆర్కే జైన్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



పాఠశాలలో మొక్కలు నాటుతున్న డీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

డెంకాడ: మండలంలోని అమకాం పంచాయతీ పరిధిలో చిట్టి గుంకలాం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శనివారం మొక్కలు నాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్స్ డీన్ ఎస్. మోహన్‌కుమార్ అంతర్జాతీయ మినుము సంవత్సరం సందర్భంగా మినుముల వల్ల కలిగే లాభాలపై వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ షణ్ముఖరావు, ఉపాధ్యాయులు గీతారాణి, గంగాభవానీ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు

విజయనగరం పూల్‌బాగ్: బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత పావని అన్నారు. దేశ రాజధానిలో లైంగిక వేధింపులకు గురైన రెజ్లింగ్ క్రీడాకారులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ, ఏఐఎస్‌ఎఫ్ ,ఏఐవైఎఫ్ నాయకులు తెలిపారు. రెజ్లర్లకు సంఘీభావంగా శనివారం స్థానిక బాలాజీ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ, దేశ కీర్తిని ప్రపంచ నలుమూలలా చాటిచెప్పినటువంటి క్రీడాకారిణిలను బీజేపీ ఎంపీ వేధించడం తగదన్నారు.

ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు బాయి రమణమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు య. జయలక్ష్మి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. సునీల్, ఎన్. నాగభూషణం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. వాసు, గౌరీశంకర్, శివ, సుధాకర్, జయంత్ ,తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేత



సన్యాసమ్మకు నియామకపత్రం అందజేస్తున్న ఎంపీపీ సుధారాణి

నెల్లిమర్ల: మండలంలోని చినబూరాడపేట గ్రామ అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలిగా నియమితులైన యడ్ల సన్యాసమ్మకు ఎంపీపీ అంబళ్ల సుధారాణి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులు, మహిళలకు సేవలందించాలని సూచించారు. సౌత్ సెంట్రల్ రైల్వే సలహా మండలి అంబళ్ల శ్రీరాములనాయుడు పాల్గొన్నారు.

మే డే వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

నెల్లిమర్ల: పట్టణంలోని అమరవీరుల స్మారక భవనంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవానికి (మే డే) సంబంధించిన వాల్‌పోస్టర్లను ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలసూరి మాట్లాడుతూ, కార్మికుల హక్కులను కాలరాసేలా బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, వారికి కనీస వేతనం రూ. 27 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ ఆధారిత పెన్షన్‌ను కనీసం రూ. 10వేలు చేయాలన్నారు. పీటీ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పార్వతి, ఇఫ్టూ జిల్లా నాయకుడు మల్లేష్ పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి

నెల్లిమర్ల: ఉపాధిహామీ పనుల్లో భాగంగా గ్రామాల్లోని సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి ఉపాధి హామీ క్షేత్రసహాయకులను ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ క్షేత్రసహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రానున్న ఖరీఫ్ సీజన్‌లో సాగుకు అవసరమయ్యే నీరందించడంలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా పూడికతీత పనులు చేపట్టాలన్నారు.

సీఎం సభకు తరలిరావాలి

భోగాపురం: అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో నిర్వహించనున్న బహిరంగసభకు మండల సమాఖ్య సంఘ సభ్యులు, సీసీలు, బుక్‌కీపర్లు అధిక సంఖ్యలో తరలిరావాలని వెలుగు ఏరియ కోఆర్డినేటర్ విజయ కుమార్ కోరారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో బుక్ కీపర్లు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన ప్రాంత అభివృద్ధికి మూలమైన అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఏపీఎం వై.రమణ, ఏపీఓ ఆదిబాబు, సీసీలు శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం



పూసపాటిరేగ: లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొత్తకొప్పెర్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నాలుగేళ్లలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు అనేక పథకాలకు సంబంధించిన నగదు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమవుతుందని చెప్పారు. పేదలకు మేలు జరుగుతుందంటే టీడీపీ నాయకులు చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. వారి మాయమాటలు నమ్మవద్దని సూచించారు. అనంతరం ఒక్కోకుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, దాడిశెట్టి త్రినాథరావు, అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయణరాజు, లంకలపల్లి రాజారావు, బొల్లు రమేష్, సత్యారావు మాస్టారు, దారపు గున్నారెడ్డి, మొంగం నాగబాబు, పైడి రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనపై ప్రజా విశ్వాసం



విజయనగరం: ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ప్రభుత్వ పాలనపై ప్రజలంతా విశ్వాసం చూపించడం ఆనందంగా ఉందని డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 21వ డివిజన్ మేకల కమేశా నుంచి జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీస్తూ, బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా.. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కార్పొరేటర్ కనకల నాగవల్లి, 20వ డివిజన్ కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలను నేరుగా కలుసుకుని, వారి సమస్యలు తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. ఈ సమయంలో ప్రజలందరూ ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, డివిజన్ ఇన్‌చార్జ్ కనకల గిరి, జోనల్ ఇన్‌చార్జ్ కాళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ చూపించాలి..



ప్రోగ్రెస్ కార్డులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

భోగాపురం: వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుడివాడ శ్రీదేవి అన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో ఉయ్ లవ్ రీడింగ్, సమ్మర్ యాక్టివిటీస్, కెరియర్ గైడెన్స్‌పై విద్యార్థులు శ్రద్ధ వహించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు ట్యాబ్‌లోని పాఠాలను చదువుతూ, వీడియోల ద్వారా సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. 3, 4, 5 తరగతి విద్యార్థులు టర్ల్ మెటీరియల్ అయిన చార్ట్స్, అక్షరమాల, గుణింతాలు, చతుర్థి ప్రక్రియలపై పట్టు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ బడి నరసమ్మ, ఉపాధ్యాయులు పడాల చంద్రశేఖర్, లక్ష్మణరావు, భవానీ, పార్వతిదేవి, సూర్యకాంతం, గణపతి, రఘు, సీఆర్పీ మాత శేషుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసనలో పాల్గొన్న ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ జేఏసీ అమరావతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మలి దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా 52వ రోజు నిరసన కొనసాగింది. శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట కాంట్రాక్ట్ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే నిరసనలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ చైర్మన్ కేవీ రమణరాజు, సెక్రటరీ జనరల్ ఎ. విజయ్‌కుమార్, ట్రెజరీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి పి.పద్మనాభం, కో–చైర్మన్/రెవెన్యూ ఉద్యోగ సంఘ నాయకుడు టి.గోవింద్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఉద్యోగ సంఘ నాయకులు టీవీ రమణమూర్తి, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలనాయుడు, ఇంజినీరింగ్ ఉద్యోగులు, రెవెన్యూ, సహకార శాఖ ఉద్యోగులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

వేడుకగా సంగీత, నృత్య కళాశాల వార్షికోత్సవం



గాత్రకచేరీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

విజయనగరం టౌన్: మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల 104వ వార్షికోత్సవం కళాశాల ఆవరణలో శనివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కచేరీ మందిరంలో విద్యార్థులు నిర్వహించిన సంగీత, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన సభకు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, డాక్టర్ జి. సన్యాసమ్మ, విశాఖ సెయిల్ రిటైర్డ్ ఫైనాన్సియల్ మేనేజర్ రామారావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన